# ఆరని దీపం అమ్మ

-తాటికోల పద్మావతి

శాంతమ్మకు నాలుగు రోజుల నుంచీ కాస్తంత నలతగా ఉంటున్నది. అరవై పైబడిన వయసు. ఇంకా ఇంటి చాకిరీ అంతా నెత్తిన వేసుకొని చేస్తుంది. నలుగురు కొడుకులు, ఇద్దరాడ పిల్లలు. భర్త బ్రతికున్న రోజుల్లోనే అందరికీ పెళ్ళిళ్ళు చేశాడు. ప్రస్తుతం ఉండటానికి ఇల్లు తప్ప మరే ఆధారం లేదు. ఫ్యాక్టరీలో గుమాస్తా ఉద్యోగం చేస్తూ ఉన్నంతలోనే చదివించారు. ఇద్దరాడ పిల్లల కోసం ఉన్న రెండెకరాల పొలం అమ్మవలసి వచ్చింది.

శాంతమ్మ భర్త పోయే నాటికి కొడుకులందరికీ రెక్కలొచ్చాయి. వాళ్ళ తెలివితేటలతో ఉద్యోగాలు సంపాదించుకొన్నారు.

శాంతమ్మ చిన్న కొడుకు దగ్గర ఉంటున్నది. ఆరోగ్యం బాగా లేక ఉదయం లేవలేకపోయింది. ఇంట్లో ఎక్కడ పని అక్కడే ఉంది. చిన్న కోడలు రమ ఎనిమిది గంటలైనా నిద్ర లేవలేదు. చిన్న కొడుకు సుధాకర్ అమ్మా! అమ్మా! కాఫీ టిఫిన్ రెడీనా, నేను అర్జంటుగా బయటికి వెళ్ళాలంటూ కేకలు పెడుతుంటే ఉలిక్కిపడి లేచింది శాంతమ్మ. రమ లేచినట్లు ఎక్కడా అలికిడి వినిపించటం లేదు.

ఈరోజు నా వంట్లో ఏం బాగా లేదురా. ఏ పనీ చేసే ఓపిక లేదు. రమని లేపలేకపోయావా అంది.

ఛీ! ఛీ ఇద్దరాడ వాళ్ళున్నారు ఈ కొంపలో! కాస్త కాఫీ కలిపి ఇచ్చే దిక్కు లేదంటూ చిందులు తొక్కుతుంటే ఆ అరుపులు విని లేచింది రమ.

అబ్బబ్బ ఏమిటండీ ఆ కేకలు! ఒక్కరోజు కాస్త ఆలస్యంగా లేస్తే ఏవో కొంపలు అంటుకుపోయినట్లు కేకలు పెడుతున్నారు. ఉందిగా మీ అమ్మ. మీకు కాఫీ కూడా కలిపి ఇవ్వలేదా అంటూ రాగాలు తీసేసరికి శాంతమ్మకు చిర్రెత్తుకొచ్చింది.

రోజు కాఫీ కలిపి ఇచ్చేది ఎవరనుకొన్నావు. ఒక్కరోజు ఆరోగ్యం బాగా లేకపోతే రాద్ధాంతం చేస్తున్నావు. నీకంటే వయసులో పెద్దదాన్ని. చీకటితో లేచి అన్ని పనులు నేను చేస్తుంటే నువ్వు మాత్రం ఎనిమిది గంటలైనా లేవకుండా పడుకొంటున్నా ఒక్క మాట అనటం లేదు. నా మంచితనం అలుసుగా చేసుకొని నన్నెన్ని మాటలన్నా నోరు మూసుకొని పడి ఉంటున్నాను. నా భర్త బ్రతికి ఉంటే నాకిన్ని అగచాట్లు ఉండేవి కావంటూ కళ్ళ నీళ్ళ పర్యంతం అయింది.

పొద్దుట లేచినప్పటి నుంచీ ఇంట్లో ఒకటే గోల. ఇంట్లో ఉండాలంటేనే నరకంగా ఉంది. ఎవరో ఒకరు సర్దుకుపోరు. రమా నువ్వెళ్ళి కాఫీ కలిపి తీసుకొనిరా! అమ్మకి వంట్లో బాగుండలేదుట అన్నాడు సుధాకర్!

వంట్లో బాగాలేకపోతే ఇంకా ఉన్నారుగా కొడుకులు. వాళ్ళ దగ్గరికి వెళ్ళి వైద్యం చేయించుకోమనండి. ఎపుడూ మనింట్లోనే ఉండకపోతే వాళ్ళ దగ్గరికి కూడా వెళ్ళి ఉండవచ్చుగా. మీరొక్కరే కొడుకు గాదు అంది రమ.

శాంతమ్మ మనసు చివుక్కుమంది. ఉన్న ఊరు వదిలిపెట్టి ఉండలేక చిన్న కొడుకు దగ్గరే ఉంటున్నది. ఎందుకో మనసుకి బాధ కలిగింది. తన ఇంట్లో తను ఉండే అదృష్టం లేదా అనుకొంటూ మంచం మీద నుంచి లేచి నాలుగు చీరలు సంచీలో సర్దుకొని పెద్ద కొడుకు దగ్గరకు బయలుదేరింది. ఒక్కతే బస్సు ఎక్కి ఇంటికి వెళ్ళే సరికి మధ్యాహ్నం రెండు గంటలైంది. ఒకటే నీరసం. దారిలో డజను అరటిపళ్ళు కొని వాటిలో రెండు నోటిలో వేసుకొంది.

ఇంటి ముందు ఆటో దిగి అపార్ట్‌మెంటులో మూడో అంతస్తు వరకూ మెట్లన్నీ ఎక్కి వెళ్ళేసరికి కళ్ళు బైర్లు కమ్మిపోతున్నాయి. వంట్లో సత్తువ లేకుండా పోయింది. కోడలు తలుపు తీయగానే మాట్లాడే శక్తి లేక మంచినీళ్ళ కోసం సైగ చేసింది.

కోడలు నీళ్ళు తెచ్చి ఇవ్వగానే గటగటా

త్రాగేసింది. పది నిమిషాలు ఫ్యాను గాలి క్రింద కూర్చుంటే గాని తిరిగి మాట్లాడే ఓపిక రాలేదు.

అత్తగారూ ఏమిటలా ఉన్నారు. రండి భోజనం చేద్దురు గాని అంటూ భోజనం వడ్డించింది శ్యామల.

వద్దమ్మా నేనేమీ తినలేను. వంట్లో బాగా లేదని చెప్పటంతో చెయ్యి పట్టుకొని చూసింది శ్యామల. జ్వరం వచ్చినట్లుగా ఉంది. టేబులు సొరుగులో నుంచి ఒక మాత్ర తీసి ఇది వేసుకోండి తగ్గుతుందని చెప్పటంతో ఆ మాత్ర వేసుకొని మంచినీళ్ళు త్రాగి కళ్ళు మూసుకొని పడుకొంది.

సాయంత్రం నాలుగు గంటలు కాగానే పిల్లలిద్దరూ స్కూలు నుంచి వచ్చారు. నాయనమ్మను చూడగానే వాళ్ళకి ఎక్కడలేని సంతోషం కలిగింది. ఇద్దరూ మంచం మీద కూర్చున్నారు. ఆప్యాయంగా దగ్గరికి పిలిచి సంచిలో నుంచి అరటిపళ్ళు తీసి ఇచ్చింది. కాసేపు కబుర్లు చెప్పి ట్యూషన్‌కి వెళ్ళాలంటూ వెళ్ళిపోయారు పిల్లలిద్దరూ.

ఆరు గంటలకు పెద్ద కొడుకు శ్రీరాం వచ్చాడు. మంచం మీద పడుకొన్న తల్లిని చూసి అమ్మా ఎప్పుడొచ్చావంటూ పలుకరించాడు.

మధ్యాహ్నం వచ్చానురా! నిన్ను చూడాలనిపించింది. నీ దగ్గర కొన్నాళ్ళు ఉందామనుకొంటున్నాను అంది.

అలాగేలేమ్మా, నీ ఇష్టం వచ్చినన్నాళ్ళు ఉండవచ్చు. నువ్వు వస్తున్నావని కబురు పెడితే నేనే తీసుకొని వచ్చేవాడిని గదా. జ్వరంలో రాకపోతే ఏమైంది. సరేలే విశ్రాంతి తీసుకో. రేపు డాక్టర్ దగ్గరికి తీసుకొని వెళతానన్నాడు.

ఆ రాత్రి గడిచినా శాంతమ్మ జ్వరం తగ్గలేదు. మర్నాడు శ్రీరాం సెలవు పెట్టి తల్లిని హాస్పిటల్‌కి తీసుకొని వెళ్ళాడు. జ్వరం అనగానే రక్తపరీక్ష చేసి టైఫాయిడ్ అని చెప్పాడు డాక్టర్. మందులు ఇంజక్షన్లు వ్రాసిచ్చాడు. ప్రతిరోజూ వచ్చి చూపించుకోవాలన్నాడు. హాస్పిటల్ నుంచి వచ్చేటప్పుడు మందులన్నీ కొన్నాడు శ్రీరాం.

శాంతమ్మ వచ్చీ రావటంతోనే మంచం ఎక్కటం, ఆమెకు సపర్యలు చేయటం వలన క్షణం కూడా తీరిక లేకపోవటంతో పెద్ద కోడలు శ్యామలకు విసుగ్గా ఉంది. అత్తగార్ని మంచంలో నుంచి లేపి కూర్చోబెట్టటం, వేళకు పాలు, పండ్ల రసాలు అందించటం, మందులు వేయటంతోనే సరిపోతున్నది. భర్తతో కలిసి సినిమాలకు, షికార్లకు వెళ్ళటం కుదరటం లేదు. ఇల్లే ఒక బందిఖానా అనుకొనే వాళ్ళకి ఉద్యోగం మగువ లక్షణం అన్నట్లు శ్యామల ఈమధ్య ఉద్యోగాల వేటకు బయలుదేరి ఎలాగో ఒక స్కూల్లో టీచరు జాబ్ సంపాదించుకొంది. మరో నాలుగు రోజుల తర్వాత ఉద్యోగానికి వెళ్ళాలి. ఇంట్లో అత్తగారున్నది. ఆమె లేచి తిరిగే వరకూ ఉద్యోగంలో చేరటానికి లేకుండా ఉంది.

శాంతమ్మకు కాస్త జ్వరం తగ్గుముఖం

## ముత్యమంత సముద్రం

ఎప్పుడంటే అప్పుడు
కవిత్వం రాదు
ఏడాదికొకసారి
వసంతం వచ్చినట్లు
చెట్లు పూలు కురిపించినట్లు
సమయపాలన చేసుకునీ రాదు!

చూపువాలిన చోటల్లా
మాట కవిత్వంలోకి అనువాదమవదు
నాలుగు వాక్య సమూహాల మధ్యా పట్టుపడదు

శ్వాసకీ ఆలోచనకీ
తీవ ఏదో అడ్డంపడి
గిలగిలలాడి
మనసు సమస్త ప్రకృతిలోకీ
జరజరా పాకి
జీవన సారాన్ని పీల్చుకొని
గుక్కెడు భావాల్ని ఒక్క మాటలోకి
అనువదించే యాతనానుభవం పొందితేనే
గాని
ఎప్పుడంటే అప్పుడు
కవిత్వం రాదు!

**–ఆదూరి సత్యవతీదేవి**

పట్టింది. మనిషి మాత్రం చాలా నీరసంగా ఉంది. పెద్ద వయసు. త్వరగా లేచి తిరిగే పరిస్థితి కనిపించటం లేదు. రాత్రి భోజనాలైనాక పిల్లల్ని నిద్రబుచ్చింది. అమ్మ పడుకొందా అడిగాడు శ్రీరాం!

ఆమె పడుకొని చాలా సేపయింది. చూడండి! నేనిలా చెబుతున్నానని మీరేమీ అనుకోవద్దు. నేను నాలుగు రోజుల్లో ఉద్యోగంలో చేరాలి, పిల్లలిద్దరూ స్కూల్‌కి వెళతారు. మీ అమ్మగారిని ఇక్కడ కూర్చోబెట్టి సేవలు చేయటానికి నాకు తీరిక ఉండదు. నేనొక్కదాన్నే ఆమెకి సేవలు చేయాలా! ఇంకా ఉన్నారుగా కొడుకులు కోడళ్ళు. వెళ్ళి వాళ్ళ చేత చేయించుకోమనండి. నావల్ల మాత్రం కాదు. మీరు ఆమెని ఉండమని బలవంతం చేయకండి! అంటూ నిష్కర్షగా చెప్పింది భర్తతో!

అదేంటి శ్యామలా! అలా అంటావు! అమ్మని ఈ వయసులో చూడకపోతే ఎలా చెప్పు. ఇపుడు నీకు ఉద్యోగం చేయాల్సిన అవసరం ఏముంది. అమ్మని కొన్నాళ్ళ పాటు మన దగ్గరే ఉంచుకొందాం!

నాకు తెలుసు మీరిలా అంటారని! అదంతా కుదరదు. నేను చెప్పినట్లు చేయకపోయారంటే నేను నా పిల్లల్ని తీసుకొని పుట్టింటికెళ్ళిపోతా. మీరూ, మీ అమ్మా ఉండండి. నేను మాత్రం ఈ ఇంట్లో ఒక నిమిషం కూడా ఉండనంటూ విసురుగా చాపా దిండూ వేసుకొని నేల మీద పడుకొంది.

ఎంత మంచంలో ఉన్నా శాంతమ్మ నిద్ర పోకపోవటంతో కోడలు అన్న మాటలు వినబడినాయి.

అంటే తనిక్కడ ఉండగూడదా! కొన్నాళ్ళు ఇక్కడ విశ్రాంతి తీసుకొందామని వస్తే కోడలు ససేమిరా ఒప్పుకోనంటున్నది. నేనిక్కడే ఉంటే తను వెళ్ళిపోతుందా! నా మూలంగా వాళ్ళిద్దరికీ ఎడబాటు కలిగించటం దేనికి. కొడుకుని, కోడల్ని వేరు చేసిన పాపం నాకెందుకు. అలాగే నేనే వెళ్ళిపోతానులే అనుకొంటూ బలవంతంగా కళ్ళు మూసుకుంది!

రాత్రంతా కలత నిద్రలో కోడలు అన్న మాటలు పదేపదే గుర్తుకొస్తున్నాయి! బిడ్డలు లేని వాళ్ళు ఎంతో బాధపడుతున్నారు. బిడ్డలుండి కూడా తను బాధపడుతున్నది. వృద్ధాప్యంలో కొడుకులకు భారమనుకొంటే బిడ్డల్ని కని పెంచటం భారమని తను అనుకోలేదు. ఈ వయసులో కావల్సింది గుప్పెడు మెతుకులు, ఓ నూలు చీర. వాటితో పాటు ఖాళీ సమయంలో కాస్తంత పలకరింపు. అంతేగా తాను కోరుకొన్నది. ఆలోచనలతో భళ్ళున తెల్లవారిపోయింది.

తల్లికి జ్వరం అని తెలిసినా మిగతా కొడుకులు ఎవరూ చూడటానికి రాలేదు. కొంచెం ఓపిక వచ్చి లేచి తిరుగుతున్నది. శ్యామల ఉద్యోగంలో చేరింది. శాంతమ్మ ఒక్కతే ఇంట్లో పని చేయలేకపోతున్నది. శ్యామలకు బయట నుంచి రాగానే ఇంటి పనులు చేయాలంటే విసుగ్గా ఉంటున్నది. ఆ కోపం చిరాకు అత్తగారి మీద చూపిస్తున్నది.

కొడుకు ఉండమని బలవంతం చేసినా శాంతమ్మ ఉండదలచుకోలేదు. మళ్ళీ సంచి సర్దుకొని రెండో కొడుకు ఇంటికి బయలుదేరింది. శాంతమ్మను చూడగానే కొడుకు కోడలు తెల్లమొహాలు వేసి ఒకరివంక ఒకరు చూసుకొన్నారు. అత్తయ్యగారూ! మీ వంట్లో ఎలా ఉందండీ ఇపుడు! అపుడే రాకపోతే ఏమైంది. మరో నెల రోజులు ఉండలేకపోయారా! మాకు ముందుగా ఒక్క మాటన్నా తెలియచేస్తే బాగుండేది కదండీ! మీరు వస్తున్నట్టు మాకెలా తెలుస్తుంది చిన్న కోడలు.

ఇంకా నాకు వంట్లో శక్తి, తెలివితేటలున్నాయి. అందుకే ఒక్కదాన్నే రాగలిగాను.

అది కాదమ్మా! మేము సాయంత్రం నాలుగు గంటల ట్రైన్‌కి తిరుపతి వెళ్తున్నాం. అటు నుంచి మా బావమరిది పెళ్ళికి బెంగుళూరు వెళ్ళి తిరిగి వచ్చేటప్పటికి పదిహేను రోజులు పడుతుంది. నువ్వు ఒక్కదానివే ఇక్కడ ఉండలేవు. ప్రయాణానికి అన్నీ సిద్ధం చేసుకొన్నాం. మరో రెండు మూడు గంటలే వ్యవధి ఉంది. పావనీ అమ్మకి అన్నం వడ్డించు. పాపం శ్రమపడి అమ్మ ఇంటికి వస్తే ఇదే సమయంలో ఊరి ప్రయాణం వచ్చి పడింది.

పోనీ మానుకోవటానికి వీలు లేదు అంటున్న కొడుకు మాటలు నిజమో అబద్ధమో తెలియని అయోమయ స్థితిలో పడింది.

భర్త మాటలు విని ఆశ్చర్యపోయింది పావని. గబగబా లోపలికి వెళ్ళి అత్తగార్ని కూర్చోబెట్టి భోజనం వడ్డించింది.

మనసంతా బాధతో నిండిపోయింది. ఇంకా ఆకలేం వేస్తుంది. ఇక్కడైనా తనకి కాస్త విశ్రాంతి దొరుకుతుందేమోననుకొంది.

కంచం ముందు కూర్చుని మెతుకులు కెలుకుతున్నది. ఏమీ తినబుద్ధి కావటం లేదు. గదిలోంచి మాటలు వినిపిస్తున్నాయి.

మీ అమ్మగారు ఇంట్లోకి అడుగు పెట్టగానే ఎందుకలా మాట్లాడారు. మనం ఇపుడు ఏ ఊరు వెళ్ళటం లేదుగా అంది పావని.

ఓసి పిచ్చిదానా! నీకు తెలియదే. అమ్మకి ఈమధ్య ఆరోగ్యం బాగా లేదని నీకు తెలుసు గదా. అక్కడే ఉంటే ఇంకా వైద్యానికి ఖర్చు చేయాల్సి వస్తుందని తగ్గీతగ్గక ముందే మనింటికి పంపించేశారు. మళ్ళీ రోగం తిరగబెట్టిందనుకో డబ్బు ఖర్చు మన మీద పడుతుంది. ఇన్నాళ్ళు మనం హాయిగా, స్వేచ్ఛగా ఉన్నాం. ఈ ముసలి వాళ్ళని ఇంట్లో ఉంచుకొంటే మనకి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉండవు. సరసాలు, సరదాలు అన్నీ బంద్. ఎక్కడికీ వెళ్ళలేం. పూర్తిగా మంచానపడితే అన్నీ నువ్వే చెయ్యాలి. నిన్ను కష్టపెట్టటం నాకిష్టం లేదు. అందుకే అలా అన్నాను. మనం చూడనంత మాత్రాన అమ్మని చూసే వాళ్ళు లేరనుకొంటున్నావా! మిగతా వాళ్ళూ కొడుకులే గదా!

ఎంత మంచివారండీ మీరు. అయితే త్వరగా ప్రయాణానికి అన్నీ సిద్ధం చేయండి. ఈలోగా మీ అమ్మగారు వెళ్ళిపోతారు అంది.

ఆ మాటలు వినేకొద్దీ అసహ్యం వేస్తున్నది. చేస్తున్న భోజనం విషంలా అనిపించింది. కంచంలోనే చేయి కడుక్కొని లేచింది. నేను బయలుదేరుతానంటూ సంచీ చేత పట్టుకొని లేచింది.

జాగ్రత్తగా వెళ్ళమ్మా! మేము ఊరి నుంచి రాగానే నేనే కబురు పెడతానంటూ ఖర్చుల కుంచుకోమని యాభై రూపాయలు చేతిలో పెట్టాడు.

మూడో కొడుకు దగ్గరికెళితే ఎలాంటి అవమానం ఎదురవుతుందోనని వెళ్ళకూడదనుకొంది. తనకీ సంపాదన, ఆస్తి ఉంటే ఇలా చేసేవారా! తన దగ్గర డబ్బు లేదు. ఆ డబ్బే

## ఈ శతాబ్ది నాలో

శరీర మవనిగా మస్తిష్కం గగనంగా
మనస్సు చంద్రుడుగా అంతరంగం రవిగా
మనిషిలో నవ మానవ విరాట్ రూపం

ఒక బుజాన శిశువుతో మరో బుజాన మూటతో
ప్రక్కన కాలిబాట నడచే సగభాగం స్త్రీతో,
మనిషిలో ప్రపంచం బయటికి విసరేది కాదు
ఆపద బరువును దించేసే చోటు లేదు.

స్మృతి తలుపులు తెరిస్తే
రెండో బండ గుండెతో
మూడో గాజు కన్నుతో
నీడలు క్రీనీడలతో వస్తూపోయే పాత్రలు!

గత చరిత్ర, ఏ గోడకు కొక్కానికో,
తగిలించే పురావస్తువూ కాదు.
విధ్వంసంలోనూ నిర్మాణ పథానికి
మనిషిలో యత్నం, నాగరికత చిహ్నం

ఎప్పుడు బడితే అప్పుడు జలదం వచ్చి వర్షించదు
వర్షమెంత అవసరమో అంతే! ఇలపై జారదు.

సృజన మనశ్శిఖరం నుండి కవిత
పైకి ఎగిరిపోవాలనే!
ఎంత దూరమైనా నిర్భయంగా
ఏ దేశమయినా నిస్సంశయంగా

ప్రతి దిశ ఒక మిత్రమై బంధువై
మనిషి మనిషితో స్నేహం కళయై
పదపదాన పెరిగే ఆయువుతో
ఈ శతబ్దం నాలో చూపేను కొత్త జగం

**-మాదిరాజు రంగారావు**

గనుక ఉంటే నెత్తి మీద పెట్టుకొని చూస్తారు.

వస్తుంటే దారిలో దూరపు బంధువు కలిసి శాంతమ్మను ఇంటికి పిలుచుకొని వెళ్ళాడు. శాంతమ్మ తన గోడంతా వెళ్ళబోసుకుంది. ఆమె దీన స్థితి, చేసే రోదన వింటుంటే జాలి కలిగింది. శాంతమ్మను అభ్యంతరం లేకపోతే వాళ్ళ దగ్గరే ఉండమన్నారు.

అయిన వాళ్ళందరినీ వదలుకొని పరాయివాళ్ళ దగ్గర ఉండటం ఇష్టం లేదు. ఆ రాత్రికి అక్కడ విశ్రాంతి తీసుకొని తెల్లవారి బయలుదేరింది.

మనస్థాపం చెందిన ఆమె హృదయం కూతురిని చూడాలనిపించింది. రాజమండ్రికి టిక్కెట్టు కొనుక్కొని రైలెక్కి కూర్చుంది. ఎదురు సీట్లో ఉన్న అమ్మాయి వయసు తన కూతురిదే! ఎక్కడికమ్మా ప్రయాణం పుట్టింటికా, అత్తారింటికా అంటూ మాటలు కలిపింది. నీ పేరేమిటంది.

కమల. మా చెల్లెలిని వేసవి సెలవులకు తీసుకురావటానికి వెళుతున్నానంది. అలాగామ్మా! పోనీలే ఎంతైనా ఆడపిల్లవు గదా చెల్లెలి మీద ప్రేమ ఉంది. పుట్టింటికి ఆడపిల్ల వస్తే ఉన్న నాలుగు రోజులూ చాకిరీ చేయలేకపోతున్నా నంటూ విసుక్కొంటారు ఇంటి కోడళ్ళు. చీర రవిక పెట్టాల్సి వస్తుందని బాధపడతారు. ఏ ఆడపిల్లయినా ఇలా ప్రవర్తిస్తే రెండోసారి తిరిగి ఆ గుమ్మం తొక్కదు. నిన్ను చూస్తుంటే నాకెంతో సంతోషంగా ఉంది. ఇపుడు నేను మా అమ్మాయిని చూడటానికి వెళ్తున్నానంది.

మీకు కొడుకులున్నారా అనటంతో ఉన్నారమ్మా అంటూ శాంతమ్మ తన కొడుకుల ప్రవర్తన గురించి చెప్పుకోవాలనిపించలేదు. ఎంతైనా వాళ్ళు తన కొడుకులు. వాళ్ళని బయటపెట్టుకొంటే తనకి మాత్రం చిన్నతనం కాదా. తన కొడుకులు తనని బాగా చూసుకొంటారని గర్వంగా చెప్పుకొంది.

కొంతసేపు ఇద్దరి మధ్యా మాటలు సాగినాయి. ఉన్నట్లుండి శాంతమ్మ సంచీలో నుంచి స్వాతి పత్రిక బయటకు తీసింది. ఆ పత్రికలో నుంచి ఒక కూపను చించి దాని మీద వ్రాసింది. తిరిగి ఆ కూపను ఒక కవరులో పెట్టి మడిచింది.

ఆ కవరు మీద అడ్రసు కూడా వ్రాసుకొని కవరు, పత్రిక ఒక పేపరులో చుట్టి మళ్ళీ భద్రంగా సంచీలో దాచింది.

ఏమిటండీ మీరు వ్రాసిందంటూ కమల అడిగింది.

స్వాతి పత్రికలో ఒక కూపను పూర్తి చేసి పంపితే లక్ష రూపాయలు బహుమతి ఇస్తారు. నేను ఇంట్లో ఉండగా వ్రాయటానికి వీలుపడలేదు. నేను చదువురాని దానిలాగా మా వాళ్ళు లెక్కగడతారు. ఇందాక వచ్చేటప్పుడు స్టేషన్‌లో కొన్నాను. ఇంట్లో వాళ్ళకి తెలియకూడదని ఇపుడు పూర్తి చేశానంది.

నిజంగా ఆ లక్ష రూపాయల బహుమతి మీకు వస్తే ఏం చేస్తారంది కమల!

అంత అదృష్టం నాకుంటుందా! వస్తే అప్పటి సంగతి ఆలోచిస్తానంది. మాటలతో కాలక్షేపం అయింది! రాజమండ్రి స్టేషన్ రాగానే రైలు దిగి ఎవరి దోవన వాళ్ళు వెళ్ళారు.

శాంతమ్మ చిన్న కూతురింటికి వెళ్ళింది. తల్లిని చూడగానే ఎంతో ఆప్యాయంగా పలుకరించింది. తల్లి ఆరోగ్యం గురించి శ్రద్ధగా చూసుకుంటూ పాలు పండ్లు, బలానికి మంచి మందులు కొనిచ్చింది. పదిహేను రోజులు ఇట్టే గడిచిపోయినాయి. కూతురి దగ్గర ఎన్నాళ్ళు ఉండగలదు. అల్లుడు ఏమైనా అనుకొంటాడని ప్రయాణమవ్వాలనుకొంది. తిరిగి ఇంటికి వెళితే మళ్ళీ మామూలే.

స్వాతి పత్రిక తిరగేస్తుంటే లక్ష రూపాయలు బహుమతి గెల్చుకొన్న విజేత అని వ్రాసి ఉంది. అడ్రస్‌తో పాటు వివరాలన్నీ చదివి సంతోషంతో

**హైకూ!**

సింహాద్రప్పన్న
సింహాచలం కొండలో
చందనం బొమ్మ!

**–జి. విజయశ్రీ**

అమ్మా ఇలారా! నీకు లక్ష రూపాయలు బహుమతి వచ్చిందంటూ చెప్పటంతో శాంతమ్మకు ఎక్కడ లేని ఆనందం కలిగింది.

నిజంగా వచ్చిందా! నమ్మలేకపోతున్నాను. ఏది ఇలా ఇవ్వమంటూ కూతురి చేతిలో నుంచి పత్రిక తీసుకొని చూసింది. నిజంగానే తనకి బహుమతి వచ్చింది. వస్తుందనే నమ్మకం లేకపోయినా ఏదో ఆశతో వ్రాసి పంపింది. తనకి లక్ష రూపాయల బహుమతి వచ్చిందంటే తనకే నమ్మబుద్ధి కావటం లేదు. ఆ డబ్బుని ఏం చేయదలచుకుంది.

అమ్మా నువ్వెక్కడున్నావు. మేం ఊరి నుంచి వచ్చేశాం. నువ్వు వెంటనే బయలుదేరి రావాలంటూ చిన్నకొడుకు ఫోన్ చేశాడు.

అమ్మా! నీ ఆరోగ్యం ఎలా ఉంది. నీ కోడలు ఉద్యోగం మానేసి ఇంట్లోనే ఉంటున్నది. నువ్వు వచ్చి మా దగ్గరే ఉండవచ్చంటూ పెద్ద కొడుకు.

అమ్మ ఇంట్లో లేకపోతే మాకేం తోచటం లేదు. వెంటనే అమ్మని పంపించమంటూ ఆఖరి కొడుకు అందరూ ఫోన్లు చేయటం మొదలుపెట్టారు.

అమ్మని ఎలా ఇంట్లోంచి పంపించివేయాలా అనుకొన్నవాళ్ళకి హఠాత్తుగా ఈ బుద్ధి పుట్టిందంటే ఆ ప్రేమంతా అమ్మ మీద గాదు. అమ్మకి వచ్చిన లక్ష రూపాయల బహుమతి మీద. ఆ డబ్బు వచ్చిందని తెలిసి లేని ప్రేమను నటిస్తున్నారు. మా ఇంటికి రమ్మంటే మా ఇంటికి రమ్మని బతిమిలాడుతున్నారు. ఆ డబ్బు లేకపోతే తనని చూడరా.

ఆ డబ్బు కొడుకులకు తలా కాస్త పంచాలి. ఆ డబ్బు ఉన్నన్నాళ్ళు బాగా చూస్తారు ఆతర్వాత తన పరిస్థితి మామూలే!

శాంతమ్మ నలుగురు కొడుకుల్ని పిలిపించింది. నా డబ్బు చూసి మీరు నన్ను రమ్మంటున్నారు. నేనా డబ్బుని అనాధాశ్రమానికి ఇవ్వాలనుకొన్నాను. ఎంతైనా మీరు నా కన్న బిడ్డలు. ఏ తల్లీ బిడ్డలకు అన్యాయం చేయదు. మీ సంపాదన శాశ్వతం కాదు. మీకూ పిల్లలున్నారు. రేపు వాళ్ళు పెరిగి పెద్ద వాళ్ళవుతారు. మీరు తిన్నా తినకపోయినా వాళ్ళని చదివించి పెద్దవాళ్ళని చేస్తారు. వాళ్ళకి రెక్కలొచ్చి మీలాగానే ఎగిరిపోతారు. అపుడు మీ పరిస్థితి ఏమిటి. ఏ అనాధ ఆశ్రమంలోనో చేరాలి. అంత గతి మీకు పట్టకూడదు. నీ తల్లిని చూసినట్లే మేమూ మిమ్మల్ని చూస్తాం అని మీ పిల్లలడగవచ్చు. నా బిడ్డలు బాధపడితే నేను చూడలేను. అమ్మంటే వెలుగు చూపించే దీపం లాంటిది. దీపంలా కాలిపోతూ తన బిడ్డలకు వెలుగునిస్తుంది. ఇంకా నేను ఎన్నాళ్ళో బ్రతకలేను. ఆ డబ్బుని మీ నలుగురి పేర డిపాజిట్ చేస్తాను. ఒక్కొక్క నీటి బొట్టు మహా సముద్రమైనట్లు అది మీ వృద్ధాప్యంలో ఉపయోగపడుతుంది. అపుడు మీరు ఆనందంగా గడపగలుగుతారు. ఈ విషయం చెప్పటానికే మిమ్మల్ని పిలిపించాను. మీ మీద ఆధారపడి బతుకుతూ మిమ్మల్ని కష్టపెట్టటం దేనికి. నా దారి నేను చూసుకొంటాను. ఈ ప్రపంచంలో నాలాంటి వారికి అనాధాశ్రమాలు చాలా ఉన్నాయి. మీరింత మంది ఉండగా ఎవరూ లేరని అనాధని అని చెప్పుకోవటం నాకిష్టం లేదు. అందుకే మీ అంతట మీరుగా వచ్చి నన్ను ఆశ్రమంలో చేర్పించితే సంతోషంగా ఉంటాను. మీరే నిర్ణయించుకోండి అంది.

వాళ్ళందరి మనసుల్లో అమ్మ ఒక దేవతలాగా కనిపించింది. ఈ వయసులో తను పడే కష్టం తన పిల్లలు పడకూడదనుకొని ముందు చూపుతో తనకి బహుమతిగా వచ్చిన డబ్బుని డిపాజిట్ చేసి తాను మాత్రం ఆశ్రమంలో చేరుతానంది. నిజంగా అమ్మంటే ఆరని జ్యోతి. తాను కాలిపోతూ వెలుగునిచ్చే కొవ్వొత్తి లాంటిది.

అమ్మా, మమ్మల్ని క్షమించు. ఇక నుంచి నిన్నెప్పుడూ కష్టపెట్టం. మా అందరి దగ్గరా నీ ఇష్టమైనన్ని రోజులు ఉండవచ్చు. నిన్నెప్పుడూ బాధపెట్టం. చివరి వరకూ మా ఋణం తీర్చుకొంటాం. అమ్మా మా ఇంటికి రమ్మంటే మా ఇంటికి రమ్మని అందరూ ఆహ్వానించారు.

ఆ తల్లి కళ్ళల్లో దీపావళి నాటి మతాబులు వెలిగాయి. అందరి మొహాలు చిచ్చుబుడ్డిలా వెలిగిపోతుంటే ఆనాటి అమావాస్య దీపావళి ఆనందంగా జరుపుకొన్నారు. ■